క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ గావించారు.

నేత్రదానం



జయరామిరెడ్డి(ఫైల్)

విడవలూరు: మండలంలోని తుమ్మగుంటకు చెందిన పూనూరు జయరామిరెడ్డి (88) మంగళవారం అనారోగ్యంతో నెల్లూరు గోమతి నగర్‌లో మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యుల కోరిక మేరకు మన సేవా సంస్థ చైర్మన్ దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు జయరామిరెడ్డి నేత్రాలను దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి ఐ టెక్నీషియన్ లాలేష్, బాలాజీ నేత్రాలను సేకరించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

మనుబోలు : మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి మంగళవారం విచారణ చేశారు. ఈనెల 16వ తేదీ రాత్రి కొమ్మలపూడి గ్రామానికి చెందిన ఏడుముళ్ల మస్తాన్ ఆయన భార్య వైదేహిలపై అదే గ్రామానికి చెందిన పెంచలయ్య, మనోహర్ కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి గాయ పరిచినట్లు బాధితులు ఈనెల 17న ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టారు. డీఎస్పీ వెంట మనుబోలు ఎస్సై అజయ్‌కుమార్ ఉన్నారు.

పిచ్చుకలను సంరక్షించాలి



వేరుశనగ తొక్కలతో రూపొందించిన పిచ్చుక బొమ్మ

ముత్తుకూరు : అంతరించిపోతున్న పిచ్చుక జాతి పక్షులను సంరక్షించాలని మండలంలోని సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం విజ్ఞప్తి చేశారు. వేరుశనగ తొక్కలతో మంగళవారం పిచ్చుక బొమ్మను తయారు చేసి ప్రదర్శించారు. ఈనెల 20వ తేదీన ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఆయన ఈ బొమ్మను ఆవిష్కరించారు.

తాటిపర్తిలో కలకలం

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామంలో కలకలం రేగింది. పాఠశాలకు సమీపంలో ముగ్గులు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ తదితర సామగ్రి ఉండటాన్ని మంగళవారం ఉదయం గ్రామస్తులు గుర్తించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పొదలకూరు పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు.

పోలీసులకు పతకాలు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి ఈ ఏడాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పతకాలను ప్రకటించింది. నెల్లూరు సీఐడీ డీఎస్పీ కె.వేణుగోపాల్ ఉత్తమ సేవాపతకం, ఉదయగిరి సీఐ వి.గిరిబాబు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ ఎ.మల్లికార్జునరావు, దర్గామిట్ట హెడ్ కానిస్టేబుల్ జి.భాస్కర్‌రావు, చిన్న బజారు హెడ్ కానిస్టేబుల్ బి.వి.వినోద్ కుమార్, కావలి ఫైర్‌మన్ సీహెచ్ నారాయణలకు సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. వీరు ఈ పతకాలను అందుకోనున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన పట్టణంలో చెర్లోయడవల్లి అడ్డరోడ్డు సమీపంలో మంగళవారం జరిగింది. బాధితుల సమాచారం మేరకు.. శ్రీనివాసులు (24) చెర్లోయడవల్లి రోడ్డు నుంచి బైక్‌పై నెల్లూరుపాళెం వస్తున్నాడు. అదే సమయంలో అతనికి ఎదురుగా ఎస్‌కే మస్తాన్ బైక్‌లో వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. శ్రీనివాసులు తలకు తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని వారు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోవూరు టీడీపీలో కొత్త కుంపటి

- కొత్తగా చేరిన ప్రశాంతిరెడ్డికి పార్టీ టికెట్
- దీంతో క్యాడర్‌కు సహకరించని పోలంరెడ్డి వర్గం
- అధినేత బుజ్జగించినా పట్టించుకోని వైనం
- అయోమయంలో నాయకులు, కార్యకర్తలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కోవూరు టీడీపీలో చేరికలు కొత్త కుంపటికి దారితీసింది. ఇంతకాలం జెండా మోసిన పార్టీ క్యాడర్‌ను పక్కన పెట్టి కొత్తగా చేరిన వారికి పెద్దపీట వేయడంతో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. టీడీపీ కోవూరు నియోజకవర్గ అభ్యర్థిగా ప్రశాంతిరెడ్డిని ప్రకటించినప్పటి నుంచి వేరుకుంపటి మొదలైంది. మొదటి నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు తమకు టికెట్ ఇస్తామని నమ్మబలికి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి టికెట్ ఇవ్వడంపై పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తనయుడు దినేష్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో చంద్రబాబు దినేష్‌రెడ్డికి టికెట్ ఇస్తామని చెప్పారని, ఆ విషయాన్ని విస్మరించి తాజాగా పార్టీలో చేరినవారికి టికెట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని వాపోతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, రెండు సంవత్సరాలుగా నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆఖరి నిమిషంలో పార్టీ టికెట్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తిని కలిగించిందన్నారు. ఈ విషయమై నాలుగురోజుల క్రితం జిల్లా టీడీపీ నేతలు నారాయణ, బీద రవిచంద్ర కలిసి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో పాటు దినేష్‌రెడ్డిని విజయవాడకు పిలిపించుకుని చంద్రబాబు బుజ్జగించే ప్రయత్నం చేశారు. పార్టీ అధికారంలోకి వస్తే కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు 2027లో ఎమ్మెల్సీ ఇస్తామని నమ్మబలికారు. అయినప్పటికీ తండ్రి, కొడుకులు అయిష్టంగానే అక్కడి నుంచి వచ్చేశారని వారి సన్నిహితులు తెలియజేశారు.



టీడీపీకి ఓటమి ఖాయం

ప్రశాంతిరెడ్డి అభ్యర్థిత్వంపై కోవూరు టీడీపీలో మొదలైన రచ్చతో ఆ పార్టీకి భారీ నష్టం చేకూర్చనుంది. టీడీపీ నాయకుల్లో మొదలైన కలవరం వైఎస్సార్‌సీపీకి వరంగా మారింది. 2019 కంటే ప్రస్తుతం ఎక్కువ మెజారిటీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి దక్కుతుందని ఆ పార్టీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. దీనికితోడు పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్నారు. టీడీపీలో వర్గపోరు తమ భవితవ్యంపై ప్రభావం చూపుతుందని లోలోపల మదనపడుతున్నారు.

ఫుల్‌జోష్‌లో వైఎస్సార్‌సీపీ

నియోజకవర్గంలో ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ఫుల్ జోష్‌లో ఉంది. స్థానిక ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మరోసారి అత్యధిక మెజారిటీతో గెలుపొందుతారని రాజకీయ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రజలతో మమేకవడం ప్రసన్నకు కలిసొచ్చే విషయం. కరోనా సమయంలో ప్రతిపక్ష టీడీపీ నాయకులు కనీసం బయటకు కూడా రాలేదు. ఆ సమయంలో ఎమ్మెల్యే ప్రసన్న ప్రజలకు అందించిన సేవలు ఎంతో మన్ననలు పొందాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఏ సమస్య వచ్చినా స్థానిక నాయకుల సహకారంతో వెంటనే పరిష్కరిస్తారు. దీనికితోడు తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరిట నిర్వహిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పిల్లలు, మహిళలకు ఆర్థిక సహకారం అందించారు. ఎందరో దివ్యాంగులకు వీల్‌చైర్లను అందించారు. దీంతో పాటు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తనతో పాటు నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డికి భారీ మెజారిటీ వచ్చేందుకు ఇప్పటికే పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రసన్న విజయానికి అదనపు బలం. వృద్ధులు, వికలాంగులకు వలంటీర్ల ద్వారా సమయానికి పింఛన్ అందడం మొదలు వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ చేయూత తదితర నవరత్నాల పథకాలు వైఎస్సార్‌సీపీ విజయానికి తోడ్పడుతాయి.

నేటి నుంచి కాకాణి ఎన్నికల ప్రచార భేరి

తోటపల్లిగూడూరు : మండలంలోని తూర్పు తీర ప్రాంతమైన వెంకన్నపాళెం నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన ఎన్నికల ప్రచార భేరి కార్యక్రమాన్ని బుధవారం నుంచి చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమక్షంలో తన ప్రచార శంఖారావాన్ని పూరించనున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్య గౌడ్ మంగళవారం పిలుపునిచ్చారు.

మర్యాదపూర్వకంగా..



అనిల్‌కుమార్‌యాదవ్‌తో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

ఇందుకూరుపేట : నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం వినుకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గూడూరు ప్రభాకర్‌రెడ్డి, కావలి రవి, తంబు వెంకటేశ్వర్లు, జి.విజయ్‌కుమార్‌రెడ్డి, మురళీకృష్ణ, రఘురామయ్య, రూప్‌కుమార్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : పట్టణంలోని జమునా సినీకాంప్లెక్స్ పక్కన వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇక్కడే ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉన్నందున పార్టీ కార్యకలాపాలను కార్యాలయం నుంచే నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, జెడ్పీటీసీ నిర్మలమ్మ, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, సర్పంచ్ చిట్టెమ్మ, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు కోనం చినబ్రహ్మయ్య, వాకాటి శ్రీనివాసులురెడ్డి, అంజాద్, లచ్చారెడ్డి, ఎ.వెంకటసుబ్బయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నపాళెం నుంచి ప్రచారం

తోటపల్లిగూడూరు మండలం వెంకన్నపాళెం నుంచి బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నట్లు మంత్రి కాకాణి వెల్లడించారు. అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాల్సిందిగా సూచించారు.

ఫైనాన్స్ కాంప్లెక్స్ నిర్మాణం 90 శాతం పూర్తి

- ఖజానా శాఖ జిల్లా డీడీ గంగాద్రి



అధికారులతో మాట్లాడుతున్న డీడీ

కోవూరు: ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయినట్లు ఖజానా శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గంగాద్రి అన్నారు. కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో రూ.1.8 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ఉప ఖజానా కార్యాలయ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. నెల్లూరులో ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.14 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్యాంసన్, ఎస్టీఓ కిరణ్ కుమార్, ఏటీఓ లోకేశ్, ఏఈ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ముమ్మర ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పొదలకూరు : మండలంలోని డేగపూడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. అభివృద్ధి ఎవరు చేశారో ఆలోచించి ఓటు వేయాల్సిందిగా కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ ప్రచారంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పులి వెంకటేశ్వర్లురెడ్డి, సర్పంచ్ మండి ఓబుల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ నోటి రామలింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ జి.పెంచలయ్య, పులి వెంకటరామిరెడ్డి, పి.కృష్ణారెడ్డి, టి.శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు మెరుగైన సేవలు



రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణమౌర్య

కోవూరు : గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు మెరుగైన సేవలు అందించేలా పశు వైద్యులు, పశుసంవర్ధక శాఖ సహాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య సూచించారు. కోవూరు పశుసంవర్ధకశాఖ పరిధిలోని విడవలూరు మండలం ఊటుకూరు, వావిళ్ల తదితర ప్రాంతాల్లో గ్రామీణ పశు వైద్యశాలలు, రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించేలా తగిన చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఊటుకూరు వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కృష్ణంరాజు, సహాయకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య పరిరక్షణ



నార్తురాజుపాళెంలో యోగాసనాలపై శిక్షణ



పద్మనాభసత్రంలో పోషకాహారంపై అవగాహన

కొడవలూరు : యోగాతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెంలో సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, పద్మనాభసత్రంలో సూపర్‌వైజర్ ఎస్.నిర్మల, పెమ్మారెడ్డిపాళెంలోని వడ్డిపాళెంలో సూపర్‌వైజర్ వి.పద్మావతి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా సాధనతో పాటు పోషకాలున్న శ్రేష్టమైన ఆహారం తీసుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులను దూరం చేసి ఆరోగ్యకరంగా జీవించవచ్చన్నారు. గర్భిణులు, బాలింతలు సైతం వైద్య సిబ్బంది సూచనలతో యోగాసనాలు చేయవచ్చని వివరించారు. నార్తురాజుపాళెంలో మహిళా పోలీసు హర్షవర్ధన, వీపీఏ డి.నవీన్‌కుమార్, డీఏ డి.మల్లీశ్వరి, ఏఎన్‌ఎం వి.రాధిక, అంగన్‌వాడీలు అమరావతి, విజయలక్ష్మి, రాజేశ్వరి, కృష్ణవేణి, మాధురి, పద్మనాభసత్రంలో అంగన్‌వాడీలు చండీప్రియ, శిరీష, సుమలత, మహిళా పోలీసు లలిత, ఏఎన్‌ఎం దొరసానమ్మ, వడ్డిపాళెంలో అంగన్‌వాడీలు ఎం.పద్మావతి, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు



పెంచలయ్య మృతదేహం

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని అనికేపల్లి సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. అనికేపల్లికి చెందిన వేల్పుల పెంచలయ్య(45), వెంకటరమణయ్య ఇద్దరూ తమ బైక్‌లలో గొలగమూడి వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు రెండు బైక్‌లు అదుపుతప్పాయి. ఇందులో వేల్పుల పెంచలయ్య రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మరో బైక్ నుంచి పడిన వెంకటరమణయ్యకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. మృతుడు పెంచలయ్యకు భార్య వజ్రమ్మ, కొడుకు, కుమార్తె ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక కార్యక్రమాలపై ఆసక్తి చూపాలి

- వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి

వెంకటాచలం: విద్యార్థులు సామాజిక కార్యక్రమాలపై ఆసక్తి చూపాలని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో వరల్డ్ సోషల్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకుని, విస్తృతంగా పాల్గొనాలని సూచించారు. నాలుగు గోడల మధ్య తరగతి గదులకే పరిమితం కాకుండా సమాజంలోకి వెళ్లి సమస్యలపై అధ్యయనం చేస్తూ, వాటి పరిష్కారానికి మార్గాలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని తెలియజేశారు. వీఎస్‌యూ సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో తరచూ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ, విద్యార్థులను సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేలా అధ్యాపకులు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సమాజంలో అనేక రకాలైన వ్యక్తులతో కలిసి పనిచేసే అవకాశం సోషల్ వర్క్ విభాగం ద్వారానే ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సమాజాభివృద్ధికి ఉపయోగపడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు, సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ సునీత, అధ్యాపకులు మధుమతి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్ష



మనుబోలులో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

మనుబోలు : మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి హిందీ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. బాలుర ఉన్నత పాఠశాలలో వంద మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 72 మంది మాత్రమే హాజరయ్యారు. అలాగే బాలకల పాఠశాలలో 210 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 208 మంది హాజరయ్యారు. మొత్తంగా 30 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షలకు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా శ్రీహరి, డీవీడీ కుమార్, చీఫ్ ఆఫ్ ఎగ్జామినర్స్‌గా వసంతకుమారి, కాంతారావు వ్యవహరిస్తున్నారు.

22 మంది గైర్హాజరు

వెంకటాచలం: మండల పరిధిలో మంగళవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 968 మంది విద్యార్థులకు గానూ 946 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

36 మంది గైర్హాజరు

ఇందుకూరుపేట: మండల పరిధిలో మంగళవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 36 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరనాయక్ తెలిపారు. ఇందుకూరుపేటలోని ఎంకేఆర్ ఉన్నత పాఠశాలలో 169 మందికి గానూ 150 మంది, నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 172 మందికి 162 మంది, ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 114 మందికి 107 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ఎంఈఓ వివరించారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): నిద్రలేమితో బాధపడుతున్న ఓ వృద్ధురాలు నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉస్మాన్‌సాహెబ్‌పేటలో విశ్రాంత ఉద్యోగి మురళీధర్ – ఉమాదేవి దంపతులు నివాసం ఉంటున్నారు. ఉమాదేవి గత కొంత కాలంగా నిద్రలేమితో బాధపడుతున్నారు. మందులు వాడుతున్నా ఫలితం లేదు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె తన భర్త కన్నా తానే ముందు చనిపోవాలని మంగళవారం ఇంట్లోని గ్యాస్‌ట్యూబ్‌ను కాల్చింది. దీంతో మంటలు వ్యాపించడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన మురళీధర్ జరిగిన విషయాన్ని తన భార్య చెల్లెలు మంజువాణికి తెలియజేశారు. ఇద్దరూ కలిసి ఉమాదేవిని చికిత్సనిమిత్తం అపోలో హాస్పిటల్‌లో చేర్పించారు. ఈ మేరకు ఆమె నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ గేయ పూజిత

మనుబోలు : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయ పూజిత సూచించారు. మండలంలోని జట్లకొండూరు సచివాలయ పరిధిలో రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యులు మాళవిక, హరిప్రియ రోగులను పరీక్షించారు. ఈ శిబిరంలో 402 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పీఎంఓ వెంకటలక్ష్మి, సీహెచ్‌ఓ రాజయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటరమణయ్య, హైమావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సినీతారల సందడి



మాట్లాడుతున్న చిత్ర నటీనటులు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సినీతారలు సందడి చేశారు. 'కలియుగం పట్టణంలో' సినిమా ప్రమోషన్ కార్యక్రమం మంగళవారం కళాశాలలో జరిగింది. చిత్ర హీరో, హీరోయిన్‌లు విశ్వకార్తికేయ, ఆయుష్ పటేల్, డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి కళాశాలలో ట్రైలర్ ప్రదర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సినిమా అన్నిరకాల ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. మంచి సందేశాత్మకమైన ఈ చిత్రం ఈనెల 29న విడుదలవుతుందన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ చిత్ర యూనిట్‌ను శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో సహ నటులు, కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.